# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కర్నూలులో పర్యటనలో రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖిలో పాల్గొంటున్నారు.**
2. **దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ త్యాగాన్ని ప్రజలు మర్చిపోరని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**
3. **కులమతాలకతీతంగా దేశం మొత్తం ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం తెలుపుతోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.**
4. **రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఏపీటీఎస్ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు.**
5. **సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు.**

==========================

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం – జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవం ఈరోజు ఘనంగా నిర్వహించారు. 2023-24 విద్యా సంవత్సరంలో కోర్సులు పూర్తి చేసుకొన్న వారికి కులపతి హోదాలో గవర్నర్ డాక్టర్ ఎస్. అబ్దుల్ నజీర్ పట్టాలు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని లారెన్స్ ల్యాబ్ వ్యవస్థాపకులు, సీఈవో సత్యనారాయణచావాకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ...

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కర్నూలులో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్క్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు.

---------------------------

ఆపరేషన్ సింధూర్ సైనికులకు మద్దతుగా గుంటూరులో ఈ ఉదయం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. యువకులు జాతీయ జెండాలతో నగరవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ..

.....వాయిస్.... 28 సెకన్లు....

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి ప్రతీకగా దేశ సైనికులను అభినందిస్తూ తిరంగా యాత్రలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ రోజు అనంతపురం నగరంలో తిరంగా యాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుండి ప్రారంభమైన తిరంగా యాత్ర టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ...

..వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం శక్తి సామర్థ్యాలు యావత్ ప్రపంచానికి తెలిశాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి దేశ త్రివిధ దళాల సత్తా చాటామని మంత్రి తెలియజేస్తూ...

.....వాయిస్.... 31 సెకన్లు....

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ – ఏపీటీఎస్ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు. ప్రతి జిల్లా కార్యాలయం ఒక జిల్లా ఐటీ మేనేజర్ నేతృత్వంలో ముగ్గురు అసిస్టెంట్ మేనేజర్లతో పనిచేస్తుందని తెలిపారు. ఏపీటీఎస్ ప్రొక్యూర్‌మెంట్ సేవల ద్వారా 110 కోట్ల రూపాయలకు పైగా కొనుగోలు లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీ సేవలను మరింతగా విస్తృత పరుస్తున్నామని ఆయన తెలియజేస్తూ...

..వాయిస్.. 26 సెకన్లు....

---------------------------

అనర్హులకు సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ కాకుండా చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన –పీఎంజేఏవై వయో వందన పథకం కింద 5 లక్షల రూపాయల

ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ పథకం వర్తింపునకు ఎలాంటి సామాజిక, ఆర్థిక నిబంధనలు లేవని తెలియజేసారు. రాష్ట్రంలో 25 లక్షల మంది ఈ పథకానికి అర్హులు ఉంటారని అంచనా వేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

తిరుపతి జిల్లాలోని సూళ్లూరు పేట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం – షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ – ఇస్రో రేపు నిర్వహించనుంది. దీనికి సంబంధించి ఈ ఉదయం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. పీఎస్ఎల్వీ సీ61 రాకెట్ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ ఉపగ్రహం జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడనుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలియజేశారు .

---------------------------

పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఈరోజు స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా బనగానపల్లెలో ర్యాలీ నిర్వహించి... ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు.

---------------------------

రాష్ట్రంలో అక్కడక్కడ ఈరోజు భారీవర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు నుంచి భారీవర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. మిగతా జిల్లాల్లోనూ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. పిడుగులు పడటంతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

=====================